

రోడ్లకు మహర్దశ

- పంచాయతీ రాజ్, అండ్‌అండ్‌బీ శాఖలకు భారీగా నిధులు
- ఆర్అండ్‌బీకి రూ.247.93 కోట్లు
- పంచాయతీ రాజ్‌కు అదనంగా నిధులు
- ఇక తొలగనున్న రహదారుల కష్టాలు

ప్రభుత్వం వినూత్నంగా చేపట్టబోతున్న హామ్ రోడ్ల నిర్మాణాలతో రహదారుల కష్టాలు తొలగిపోను న్నాయి. పంచాయతీ రాజ్, అండ్ ఆర్ బీ శాఖ ఆధ్వ ర్యంలో ఇక పెద్దఎత్తున రోడ్ల నిర్మాణాలు జరుగను న్నాయి. దీనికి సంబంధించి ఆర్అండ్‌బీ శాఖకు రూ.247 కోట్ల రూపాయలను మంజూరు చేసి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాగే పంచా యతీ రాజ్ శాఖకు సైతం నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వు లు వెలువరించింది.

నిర్మల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : చాలా ఏండ్ల నుంచి జిల్లాలో రహదారుల పరిస్థితి అస్తవ్య స్థంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఇప్పటికి వందలాది గ్రామాలకు రోడ్ల సౌకర్యాలు లేక ఆ గ్రామాలు అభివృద్ధికి నోచుకో వడం లేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్నంగా హామ్ (హైబ్రిడ్ ఆన్యూటీ మోడ్) ద్వారా రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోబోతోంది. నిర్మల్ నియోజకవర్గంతో పాటు ముథోల్, ఖానా పూర్ నియోజకవర్గాలకు హామ్ కింద రోడ్ల కోసం భారీగా నిధులను మం జూరు చేసింది. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు గతంలో రూపొందించిన ప్రతిపాదనల పై ప్రభుత్వం పూర్తి స్థాయిలో కసరత్తు జరిపి ఆ ప్రతిపాదనలకు పలు సవరణలు చేసి ఆమోదం తెలిపింది. దీంతో రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కా రం లభించబోతోందని అంటున్నారు. ఓ గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రం వరకు అలాగే మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు ఇక నుంచి తప్పనిస రిగా రోడ్డుసౌకర్యం ఏర్పడబోనుంది.

నిర్మల్ నియోజకవర్గానికి....

నిర్మల్ నియోజకవర్గంలో 144.51 కోట్లతో పంచా యతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 28 రోడ్లకు గానూ 69 కోట్లతో మొత్తం 84.4 కిలోమీటర్ల వరకు రోడ్లను నిర్మించనున్నారు. అలాగే ఆర్అండ్‌బీ శాఖ ద్వారా మూడురోడ్లకు గా నూ 75.51 కోట్ల రూపాయలను హామ్‌రోడ్ల కోసం మంజూరు చేశారు. మొత్తం నిర్మల్ నియోజకవ ర్గంలో ఆర్అండ్‌బీ శాఖ కింద మూడురోడ్లను రూ.56.86 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్నారు. దీనికోసం రూ.75.51 కోట్లు వ్యయం చేసేందుకు నిర్ణ యించారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 28 రోడ్లకు గానూ 69 కోట్ల రూపాయలను ఖర్చుచేయ నున్నారు. ఈ 28 రోడ్లకు సంబంధించి 84.4 కిలో మీటర్లుగా నిర్ధారించారు.

ముథోల్ నియోజకవర్గంలో...

కాగా ముథోల్ నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ శాఖ పలు రోడ్ల నిర్మాణాలకు హామ్ విధానం పేరిట సర్కారుకు ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం 32.64 కిలో మీటర్ల పొడవుతో పెంబి, కడెం మండలాల్లో ఈ రోడ్లను నిర్మించనున్నారు. దీని కోసం గానూ 26.68 కోట్ల రూపాయలను వ్యయం చేయనున్నారు. అలాగే ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో మొత్తం మూడురోడ్లకు గానూ 53.88 కోట్లను ఖర్చు చేయనున్నారు. దీనికి సంబంధించి 97.16 కిలో మీటర్ల పొడవుగా ప్రతిపాదించారు.

ఖానాపూర్ నియోజకవర్గంలో...

ఖానాపూర్ నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ శాఖ ప్రతిపాదించిన మొత్తం రెండు రోడ్లకు హామ్ రోడ్ల విధానం కింద మంజూరు లభించాయి. మొత్తం 27.40 కోట్లతో 75.26 కిలోమీటర్ల పొడవు గల రోడ్లను నిర్మించనున్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో మొత్తం 26.68 కోట్ల రూపాయలతో 32.64 కిలో మీటర్ల మేరకు రోడ్ల నిర్మాణాలను చేప ట్టనున్నారు.



జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయం

మారుమూల పల్లెలకు సౌకర్యం..

కాగా గ్రామం నుంచి మండల కేంద్రానికి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రోడ్ల నిర్మా ణ సౌకర్యం ఏర్పడబోతుండడంతో ఇక్కడి పల్లెలన్నింటికి కనెక్టివిటీ పెరగబోతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాలకు కనీస స్థాయిలో రోడ్డు సౌకర్యం లేని కారణంగా ఆ గ్రా మాలు బాహ్య ప్రపంచానికి ఇంకా దూరంగానే ఉండాల్సి వస్తోంది. రవాణా సౌకర్యం లేక ఆ గ్రామా లన్ని అభివృద్ధిలో కుంటు పడుతున్నాయి. మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం హామ్ రోడ్లతో ఈ మారుమూల గ్రామాల రోడ్లకు మహర్దశ పట్టించబోతోందని అంటు న్నారు.

లక్కీడ్రా

- పారదర్శకంగా కొనసాగిన ప్రక్రియ
- కలెక్టర్ అభిలాష అభినవ్



లక్కీడ్రాలో నంబర్‌ను తీసి చూపిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లక్కీడ్రా నిర్వ హించారు. కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని లక్కీడ్రా ద్వారా 47 మద్యం షాపులను కేటాయించారు. మొత్తం 991 దరఖాస్తులు అందిన నేప థ్యంలో ఒక్కో షాపునకు సంబంధించిన దరఖాస్తుల ఆధారంగా టోకెన్ నంబర్లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా డ్రా తీశారు. డ్రా ప్రారంభం నుంచి ముగింపు వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపి, పూర్తిపారదర్శకతతో ప్రక్రియ పూర్తి చేశారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా డ్రా కొనసాగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో కార్య క్రమం ప్రశాంత వాతావరణంలో సాగింది. లక్కీడ్రాలో ఎంపికైన వారికి నిర్ణీత లైసెన్స్ ఫీజు చెల్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు వేదికపైనే కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్, ఎక్సైజ్ సిబ్బంది, మద్యం దుకాణాల దరఖాస్తుదారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లక్కీ లేడీ

- రెండు టెండర్లు వేస్తే 2 షాపులు ఆమెకే



రెండు దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న ఆమెకు అదృష్టం తలుపు తట్టింది. రెండింటా లక్కీ డ్రాలో విజేతగా నిలిచింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో నివాసముంటున్న గుర్రాల హారిక అనే యువతి లక్ష్మణచాంద, పొన్కల్ గ్రామాల్లో ఆమె రెండు మద్యం దుకాణాలకు టెండర్లు వేసింది. సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా పద్ధతిలో దుకాణాలు ఖరారు చేయగా ఆమె రెండు షాపులు దక్కించుకున్నది. ఆమెను ఈ సంద ర్భంగా లక్కీ లేడీ అంటూ పలువురు అభినందించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరి ష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అద నపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి ఆయన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరిం చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మా ట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్‌కు సమర్పిం చారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదిత రులు పాల్గొన్నారు.

అయోధ్యకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు

నిర్మల్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నిర్మల్ డిపో నుంచి సోమవారం అయోధ్య, కాశీకి బస్సు బయలుదేరుతున్నట్లు డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు. ఈ బస్సు నిర్మల్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బ యలుదేరి మరుసటి రోజు ఉదయం ప్రయాగ్ రాజ్ చేరుకుంటుంది. ప్రయాగ్ రాజ్‌లో త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించి అయోధ్యకు వెళ్తుంది. కాశీ నుంచి బయలు దేరి 30వ తేదీ రాత్రి నిర్మల్‌కు చేరుకుంటుం ది. ఆన్‌లైన్‌లో పెట్టిన రెండు రోజుల్లోనే సీట్లు ఫుల్‌కావడం వలన భక్తుల కోరిక మేరకు నవంబరు 6వ తేదీ రోజు మరో బస్సు అయో ధ్య, కాశీ బయలుదేరుతుందన్నారు. ముంద స్తుగా రిజర్వేషన్ చేసుకోవాలని డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు.



ఆర్టీసీ బస్సులో అయోధ్యకు వెళ్తున్న భక్తులు

మెగా రక్తదాన శిబిరం

- రక్తదానం చేసిన ఎస్పీ అడిషనల్ ఎస్పీలు, ఏఎస్పీలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవా ల సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మెగా వైద్య శిబి రాన్ని ఏర్పాటు చేశారు. వ్యాపారవేత్తల నుంచి ఆటో యూనియన్‌ల దాకా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 350 మందికి పైగా ప్రజలు రక్తదా నం చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారికి గౌరవప్రదంగా నివాళులు అర్పించారు. ప్రతీ ఒక రక్తపు బొట్టు ఒక ప్రాణాన్ని కాపాడుతుందని ఎస్పీ డా.జి. జానకి షర్మిల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకిషర్మిల స్వయంగా రక్తదానం చేసి పోలీస్ సిబ్బంది, ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారు. ఎస్పీ తో పాటు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్‌మీనా, పోలీస్ సిబ్బంది, ప్రజలు, యువకులు రక్తదానం చేశా రు. రక్తదానంలో వ్యాపారవే త్తలు, రైతులు, ముఖ్యంగా యూత్, ఆటో యూనియన్లు, 30 మందికి పైగా డీఎంహెచ్‌వో (జిల్లా మెడికల్ హెల్త్ ఆర్గ నైజేషన్) సిబ్బంది వంటి విభిన్న వర్గాల ప్రజలు పాల్గొన్నారు. తానూర్, భైంసా, లోకే శ్వరం, కల్వా, జాం, సారంగాపూర్, దస్తురా బాద్, కడెం, ఖానాపూర్, పెంబి వంటి దూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు, పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల స్వయంగా రక్తదానం చేసి పోలీస్ సిబ్బంది, ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రాణా పాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయడం అంటే కొత్త జీవితం ఇవ్వడమేనన్నారు. కార్య అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, భైం సా అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, డాక్టర్లు, మెడికల్ సిబ్బంది, టెక్నీషియను పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

సర్సాపూర్(జి) : మండలంలోని చాక్‌పల్లి, ఖామ్ని(బి) గ్రామాల యువకులు షేక్‌సల్మాన్, షేక్ ఆసిఫ్, మహమ్మద్ మాజీద్, దేవేందర్ రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకు లకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

దిలావర్‌పూర్ : పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని రక్తదానం చేసిన యువకులను ఎస్పీ డా.జానకి షర్మిల ప్రశంసించారు. ఎస్పీ వైద్యవిధాన పరిషత్ తర ఫున ప్రశంసాపత్రాలు అందజేశారు.

యూడైస్‌లో పాఠశాల వివరాల నమోదు తప్పనిసరి

- జిల్లా విద్యాధికారి భోజన్న

నిర్మల్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పాఠశాల యూడైస్‌లో వివరాలు ఖచ్చి తంగా, సరైన విధంగా నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో గల సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో నిర్వహి స్తున్న ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యూడై స్‌లో గల మూడురకాల మాడ్యూల్‌లలో పాఠ శాల వివరాలు, పాఠశాలలో ఉన్న సౌకర్యాలను, విద్యార్థులకు సంబంధించిన వివరాలు, ఉపా ధ్యాయుల వివరాలు ఒక్కసారి పరిశీలించి తప్పులుంటే సరిచేసుకోవాలన్నారు. ఈ విష యంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత ప్రధానో పాధ్యాయులు పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే స్వచ్ఛ ఏవం హరిత విద్యా లయ రేటిం గ్ కార్యక్రమంలో భాగంగా 4, 5 స్టార్‌లు పొందిన 302 పాఠశాలలను జిల్లాలోని కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు భౌతికం గా సంద ర్శించి, సర్వే వివరాలు సరైనవా కావా అని పరిశీలించాలని ఆయన తెలిపారు. పరిశీలన తరు వాత వివరాలు సరిచేసి ఫైనల్ సబ్‌మిషన్ చేయాలన్నారు. తదుపరి జిల్లా నుంచి 8 పాఠ శాలలను కమిటీ ద్వారా ఎంపిక చేసి రాష్ట్రస్థా యికి పంపించామని ఆయన తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, ప్రవీణ్ కుమార్‌లు, మండల విద్యాధి కారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఆ ర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి

అభివృద్ధి మందగించింది

- మెడికల్ కళాశాలను కాపాడుకునే బాధ్యత అందరిది
- మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పూర్తిగా పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందని మాజీ మంత్రి అల్లోల ఇంద్రక రణ్ రెడ్డి ఆరోపించారు. సోమవారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో మెడిక ల్ కళాశాల అభివృద్ధి పనుల విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆయన ఆరో పించారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ మెడి కల్ కళాశాలలో 200ల మంది వైద్య విద్యార్థుతలు చదువుతు న్నారని తెలిపా రు. 2023లో అప్పటి ప్రభుత్వం మెడికల్ కళాశాల భవన నిర్మాణం కోసం అలాగే నర్సింగ్ కళాశాల భవన నిర్మాణంతో పాటు ఇతర సము దాయాల కోసం సర్వే నంబర్ 530లో దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిం చామన్నారు. ప్రస్తుతం ఐదుఎక రాలలో మెడికల్ కళాశాల భవన నిర్మాణం చేపట్టామని, మిగతా భవన సముదాయాల నిర్మాణం పనులు చేపట్టారు. అందుకు సదరు కాంట్రాక్టర్లు ముందుకు వస్తే... స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అడ్డుకుంటున్నట్లు ఆయన ఆరోపించారు. కేవలం కమీషన్ల కోసమే కక్కుర్తి పడి... అమాయకులైన కొంతమందిని రెచ్చగొట్టి పనులను అడ్డుకుంటున్నట్లు ఆయన ఆరోపించారు. చరిత్ర హీనుడుగా మిగిలిపో తారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే కారణంగా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీతో పాటు సోన్ మండలం పాక్‌పట్ల గ్రామ సమీ పంలో నిర్మించ తలపెట్టిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, నిర్మల్ జిల్లా కేంద్రంలో రూ. 12 కోట్లతో నిర్మాణం చేపట్టాల్సిన హరిత రిసార్ట్ అభివృద్ధి పనులు జరగడం లేదని ఆరోపించా రు. జిల్లాలో ఎంతో మంది మేధావులు, విద్యా వంతులు ఉన్నారని, ఇలా ప్రతి ఒక్కరు మెడి కల్ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో ఎఫ్ఏసీ ఎస్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు ముడుసు సత్యనారాయణ, జడ్పీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌లు శ్రీకాంత్ యాదవ్, శ్రీధర్‌లతో పాటు చిట్యాల మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, రఘునందన్ రెడ్డి, అనుముల భాస్కర్, పాకాల రామచందర్, నాళం శ్రీనివాస్, ఓలాద్రి నారాయణ రెడ్డి, ఉట్ల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

యువత ఒత్తిడికి లోనుకావద్దు



సాయిరాజ్ పుట్టిన రోజు నిర్వహిస్తున్న మహిళా సంఘం

లక్ష్మణచాంద, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : యువత ఒత్తిడికి లోనై ఆత్మహత్య ప్రయత్నం చేసుకోకూడదని సామాజిక పరివర్తన మహిళా సంక్షేమ సంఘం చైర్ పర్సన్ మునిబర్తి నిర్మల్ అన్నారు. లక్ష్మణచాంద మండలం మునిపెల్లి గ్రామానికి చెందిన యువకుడు గొర్రె సాయిరాజ్(19) చిన్నతనంలో తండ్రిని కోల్పో యారు. ఆర్థిక ఇబ్బందులతో ఎలాంటి ఉపాధి లేక క్షణి కావేశంలో ఇటీవల చనిపోతానని ఇంటి నుంచి బయ టకు వెళ్లాడు. విష యం తెలుసుకున్న తాజా మాజీ ఉపసర్పంచ్ రాంపల్లి రమేష్, గ్రామ యు వకులు, పోలీ సులు కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి యువకుడిని సురక్షితంగా కాపాడారు. ఈ ఘటనను పురస్కరించు కొని సామాజిక పరివర్తన సంఘ సభ్యులు మునిపెల్లి గ్రామానికి వచ్చి రమేష్‌ను సన్మానించి, సాయిరాజ్ పుట్టి నరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మునిబర్తి నిర్మల్ మాట్లాడుతూ... యువకులు ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని, ఆత్మహత్యలు చేసుకోవడం మంచిది కాదని, భవిష్యత్తు గురించి తల్లిదండ్రుల గురించి ఆలో చించాలన్నారు. క్షణికావేశంలో ఇలా చేసుకోవద్దని తెలి యజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం చైర్‌పర్సన్ మునిబర్తి నిర్మల్, వైస్ ప్రెసిడెంట్ వరమాల, కోశాధికారి కుంబాజి రాణి, సభ్యులు వాల్గోజి శాంతాబాయి, లింగా రెడ్డి, రాజారెడ్డి, యువకులు సాయి గౌడ్, అశోక్, గణేష్, మహిళలు గంగవ్వ, సాయవ్వ, సులోచన, పద్మ, లక్ష్మీ, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే దిగుబడులు



వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కుంటాల, అక్టోబర్, 27 : (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకొని సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ముథోల్ ఏరువాక శాస్త్రవేత్త లు కార్తీక్, దినేష్‌లు అన్నారు. సోమవారం కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో నాణ్యమైన విత్తనోత్పత్తి క్షేత్రసందర్శన కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రైతులు నాణ్యమైన విత్తనోత్పత్తి, విత్తనపరిశుభ్రత స్థానిక వాతావరణానికి అనువైన రకాలను ఎంపిక చేసుకుంటే అధికదిగుబడులు సాధించవచ్చునన్నారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పలు రకాల విత్తనాల గురించి వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో గణేష్, రైతులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

నిర్మల్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి) : పీజీ కళాశాలను బేస్ చేసుకుని యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విద్యా ర్థిసంఘాల నాయకులన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ భవ నంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థిసంఘ నాయకులు మాట్లాడు తూ... జిల్లా కేంద్రంలో ఉన్న పీజీ కళాశా లను బేస్ చేసుకుని నూతన యూనివ ర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వా న్ని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యా ర్థిసంఘ నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్, సింగరి వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఏఐఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలా స్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం శివాజీ గౌడ్, జశ్వంత్, రాకేష్, కార్తీక్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ

ముథోల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని 15వ విడత మహాత్మా గాంధీ జాతీ య గ్రామీణ ఉపాధిహామీ పథకం 15వ సామాజిక తనిఖీ మంగళవారం నుంచి నిర్వ హించనున్నట్లు ఎస్ఆర్‌పీ మహేష్ తెలిపారు. మండల పరిధిలో మొత్తం 19 గ్రామ పంచా యతీలకు గాను ఈజీఎస్ ద్వారా 290 పను లకు గాను రూ. 4,79,62,997లు అలాగే పీఆర్ ద్వారా 100 పనులకు గాను రూ. 3,97,59,675 రూపాయలపై సామాజిక బృందం ఇంటింటికి వెళ్లి తనిఖీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో 10 డీఆర్పీలు, 15 జీఎస్ఏలు పాల్గొని ఇం టింటా వెళ్లి పనుల వివరాలను సేకరిస్తున్నా రని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో జరి గిన పనుల నాణ్యత, లబ్ధిదా రుల సమాచారం, రికార్డుల పరిశీలన వంటి అంశాలపై కుణ్ణంగా తనిఖీలు చేపడతా మని పేర్కొన్నారు. పారదర్శక తతో అభివృద్ధి లక్ష్యం సామా జిక తనిఖీల ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరగడం, పథకం అమలులో పారదర్శకత సాధించడం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. పంచాయతీ రాజ్ ద్వారా జరి గిన వంద పనులకు సంబంధించిన రికార్డులు ఇంకా తమకు అందలేవని అందితే వాటిని తనిఖీ చేస్తామని రికార్డులు అందని యెడల ఈజీఎస్ పథకం ద్వారా జరిగిన 290 పనులకు సంబంధించిన వాటిపై తనిఖీలు చేపడుతా మని ఎస్ఆర్‌పీ తెలిపారు.



సామాజిక బృందానికి సలహాలు ఇస్తున్న ఎస్ఆర్‌పీ



నార్నూర్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై కె.అఖిల్

పోలీస్ అమరవీరులను స్మరిస్తూ ర్యాలీ

నార్నూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు భాగంగా సోమవారం నార్నూర్ మండల కేంద్రంలో పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వివిధ సంఘటనలో అమరులైన పోలీసులకు ఎస్సై కె.అఖిల్ కార్యాలయంలో నివాళులర్పించారు. వారి వెంట సిబ్బంది నాగోరావు, క్రిష్ణ, స్వరాజ్ ఉన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

తలమడుగు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భక్తి మార్గంతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర విజయ డైరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. సోమవారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని దేవాపూర్ శివారు ప్రాంతంలో గల ప్రముఖ హోమియోపతి వైద్యులు డా.రవికిరణ్ యాదవ్ నివాసంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో పేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహా యజ్ఞం నిర్వహించారు. పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. డాక్టర్ రవికిరణ్ యాదవ్ దంపతులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మాజీ విజయ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డితో పాటు పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో కజ్జర్ల గ్రామ పెద్దలు చింతలపేల్లి దేవా రెడ్డి, ముడుపు కేదారేశ్వర రెడ్డి, గోక భూమా రెడ్డి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమాన్లు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల మల్లయ్య, నారాయణ యాదవ్, ఆశన్న యాదవ్, రవికాంత్ యాదవ్, వేణు గోపాల్ యాదవ్, మట్ట శ్రీనివాస్, రామన్న, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి : బీఆర్ఎస్

భీంపూర్/ ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భీంపూర్ మండల కేంద్రంలోనే సోయాబీన్, జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కిసాన్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించాలని మండల బీఆర్ఎస్ నేతలు కోరారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందించారు. స్మార్ట్ ఫోన్‌లు లేని రైతులకు ఏఈవోల ఆతరైజేషన్ తో కిసాన్ యాప్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ ను కలిసిన వారిలో నాయకులు గుర్ల నరేందర్ యాదవ్,గుండా ప్రకాష్ యాదవ్, బక్కి కపిల్, బండి గజానన్, గుర్ల శేఖర్, కుద్మెత గంగారాం ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న భీంపూర్ నేతలు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

● నేరడిగొండ ఎంపీడీవో శేఖర్

నేరడిగొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో శేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని వడూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేఖర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరై ఇప్పటి వరకు పనులు ప్రారంభించుకొని లబ్ధిదారులు తక్షణమే ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. గతంలోని మార్కెట్ పనులు పూర్తి చేసుకొని ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులు కూడా పిల్లర్లు, పునాదుల పనులను మొదలు పెట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏమైనా ఆర్థిక ఇబ్బందులు ఉంటే వారికి గ్రామ సంఘాల ద్వారా రుణాలు అందించడం జరుగుతుందని లబ్ధిదారులకు వివరించారు. ఈ అవకాశాన్ని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాలను త్వరగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. గతంలోని నిర్మాణాలను చేపట్టి స్లాబుల వరకు పూర్తయిన ఇళ్లకు సంబంధించి మిగతా పనులను కూడా పూర్తిచేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా లబ్ధిదారులకు సహకారం అందిస్తూ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలని కోరారు. హౌసింగ్ ఏఈ గణేష్, పంచాయతీ కార్యదర్శి సద్దాం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



వడూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో శేఖర్

ఉట్నూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకంలో లబ్ధిదారులే స్వయంగా ఫొటోలు తీసి ఇళ్ల నిర్మాణ ప్రగతి ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసే విధంగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతికి సంబంధించిన ఫొటోలను స్వయంగా లబ్ధిదారులే వారి మొబైల్ ఫోన్ ద్వారా ఎలా అప్‌లోడ్ చేయాలి అనే విషయంపై కామాయిపేట, శ్యాంపూర్, నాగపూర్ గ్రామాలలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల ప్రతీ లబ్ధిదారుడు తమ ఫోన్‌లో ప్లేస్టోర్ ద్వారా టీజీహెచ్‌సీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుకు ఇచ్చిన ఫోన్ నెంబర్ ద్వారా లాగ్‌ఇన్ కావాలన్నారు. ఓటీపీ నమోదు చేసిన తర్వాత నిర్మాణ దశలో ఉన్న ఇంటి ఫొటోగ్రాఫ్ లింక్ ద్వారా వారి ఇంటికి సంబంధించిన 4 ఫొటోలను టీజీహెచ్‌సీఎల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని వివరించారు. లబ్ధిదారులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులున్నారు.



..కామాయిపేట్‌లో ఎంపీడీవో రాంప్రసాద్

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

● ఇంద్రవెల్లిలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

ఇంద్రవెల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాగ్మారే గౌతం మృతికి కారకులైన ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాథోడ్ విజయలక్ష్మీపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. అనంతరం స్థానిక అంబేద్కర్ భవనం నుంచి అటవీ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎఫ్ఆర్వో సంతోష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలోని గొట్టిపటార్ గ్రామానికి చెందిన వాగ్మారే గౌతం అదే గ్రామంలో ఫారెస్టు ప్లాంటేషన్‌లో పశువులు మోపుతున్నాడనే కోపంతో బీట్ ఆఫీసర్ బెదిరించారని వివరించారు. ఇందులో ఏజెన్సీ షెడ్యూల్ కులాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కాటం రమేష్, డివిజన్ అధ్యక్షులు సింగారే భారత్, రాష్ట్ర కో కన్వీనర్ దావుల్ రమేష్, ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్, నాయకులు పరత్ వాగ్ దత్త, సూర్యవంశీ ఉత్తం, తదితరులున్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

పిల్లలకు పౌష్టికాహారం అందించండి

బోథ్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీఓ రమేష్ దూషించారు. సోమవారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలు పరిశీలించిన అనంతరం విద్యార్థులకు పొందుతున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలని కోరారు. అంతకు ముందు గ్రామంలో ఇందిరా మహిళలను పరిశీలించడం జరిగింది. ఇంటి నిర్మాణం పూర్తి అవుతున్న కొద్ది నిధులు మంజూరు అవుతాయని వివరించారు. దశల వారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డు ఈకేవైసీ చేయించుకోవాలని ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులకు సూచించారు. పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ వెంట పీఓ జగ్దేరావు, పంచాయతీ కార్యదర్శి మిథున్ ఉన్నారు.

కంది శ్రీనివాస రెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

ఆదిలాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డిని, ఆయన బావమరిది కుటుంబ సభ్యులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరామర్శించారు. ఆదివారం కంది శ్రీనివాస రెడ్డి బావమరిది గడ్డం అఖిల్ రెడ్డి గుండె పోటుతో మృతిచెందడంతో ఎమ్మెల్యే సోమవారం బేల మండలం సిర్సన్న గ్రామంలోని అతని నివాసాన్ని సందర్శించారు. అఖిల్ చిత్ర పటం వద్ద పుష్పాంజలి ఘటించి సంతాపం ప్రకటించారు.

అలాగే ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్ రెడ్డి, ఆయన బావమరిది కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావ్‌లు పరామర్శించారు. అఖిల్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందడంతో ఐకేరెడ్డి సోమవారం బేల మండలం సిర్సన్న గ్రామంలోని మృతుడి నివాసాన్ని సందర్శించారు.

దూది రైతు.. దుఃఖం

(5వ పేజీ తరువాయి...)

అడ్డగోలుగా దండుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

మద్దతు ధర కోసం ఆరాటం

ఈయేడు అధిక వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు మద్దతు ధర కోసం ఆరాట పడుతున్నారు. అసలే వరదలు, తెగుళ్ల బారీన పడి అంతంత మాత్రంగా వస్తున్న దిగుబడులతో అవస్థలు పడుతున్నారు. పత్తి కొనుగోళ్లలో తొలిరోజే మద్దతు ధర దక్కక పోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. గత పక్షం రోజులుగా పత్తి పంట చేతికి రావడంతో రైతులు ఇంటి వద్దనే పంటను నిల్వ చేసుకుంటున్నారు. తేమ శాతం పేరిట ధరను భారీగా తగ్గించడంతో నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. క్వింటాలు పత్తి ధర రూ.8,110 ఉంటేనే పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ.6వేల నుంచి రూ.6,950 వరకు ధర పలుకుతుందని చెబుతున్నారు. శీతాకాలంలో సాధారణంగా పత్తిలో అధిక తేమ ఉంటుంది. కురుస్తు న్న వర్షాలు, మంచుతో పత్తిలో ఎక్కువగా తేమ ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా తేమ శాతం నిబంధనలను సడలించకుండా మద్దతు ధర దక్కే అవకాశం ఉండదని పలువురు పత్తి రైతులు వాపోతున్నారు.

ఫలించిన చర్చలు

ప్రారంభంలో తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో మార్కెట్లో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో నల్లరేగడి నేలల్లోనే పత్తిపంట అధికంగా సాగవుతుంది. దీంతో తేమ శాతం కూడా ఎక్కువగానే ఉంటుంది. పంట చేతికి వచ్చిన తర్వాత రెండు, మూడు రోజులు ఆరబెట్టినా.. మార్పు కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన తేమ 8 నుంచి 12శాతం ఎట్టి పరిస్థితుల్లో సాధ్యం కాదంటున్నారు. కనీసం 20 శాతం వరకు సడలింపు ఇస్తేనే మద్దతు ధర దక్కుతుందని పలువురు పత్తి రైతులు పేర్కొంటున్నారు. అయితే ప్రతీసారి పంట చేతికి వచ్చిన సమయంలోనే ధరలు అమాంతంగా పడిపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తుంది. పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంపై స్పం దించిన కలెక్టర్ రాజర్షిషా ఎమ్మెల్యే పాయల శంకర్, వ్యాపారులు, రైతులతో చర్చలు జరపడంతో మధ్యాహ్నం నుంచి కొనుగోళ్లు యథావిధిగా ప్రారంభమయ్యాయి. మద్దతుధర రూ.8,110 కాగా.. ప్రైవేట్‌లో రూ.6,950 ధర పలికింది.

ప్రశాంతంగా మద్యం దుకాణాల లక్కీడ్రా

(5వ పేజీ తరువాయి...)

వేశారు. దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఫంక్షన్ హాల్ ప్రాంగణం కోలాహలంగా మారింది. మొత్తం ప్రక్రియను దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించారు. దుకాణాలు దక్కించుకున్నవారు సంతోషం వ్యక్తం చేయగా.. దక్కనివారు నిరాశతో వెనుదిరిగారు. ఇదిలా ఉంటే గత నెల 26 నుంచి ఈనెల 18వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియ కొనసాగింది. తక్కువ దరఖాస్తులు రావడంతో దరఖాస్తు గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించారు. జిల్లాలోని నలభై దుకాణాలకు గాను 34 దుకాణాలకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 16,17,18, ఇచ్చోడ పరిధిలోని 25,28, ఉట్నూర్ స్టేషన్ పరిధిలోని నలభైవ నంబర్ దుకాణాల లక్కీ డ్రా వాయిదా వేశారు. ఇక టెండర్ దారులు ఒక్కో షాపుకు మూడు లక్షల చొప్పున నాన్ రీ ఫండబుల్ చలాన్, డీడీ రూపంలో చెల్లించగా.. 771 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వార ప్రభుత్వానికి రూ.23 కోట్ల 13 లక్షల ఆదాయం వచ్చింది. గతంతో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య తగ్గినప్పటికీ చలాన్ పెంచడంతో ఆదాయం పెరిగింది. దుకాణాలు దక్కించుకున్న వారు 1/6 వంతు డబ్బులు చెల్లించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని షాపులకు ఏడాదికి అరవై అయిదు లక్షలు, ఇతర షాపులకు యాభై అయిదు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో యాభై లక్షలుగా ఫీజు కేటాయించగా.... లైసెన్స్ కోసం ఏడాదిలో ఆరు విడతలుగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నూతన పాలసీ ద్వార మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు రెండేళ్ల పాటు దుకాణాలను నడపుకునే వెసులుబాటు కల్పించారు. లక్కీ డ్రా ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా ఎక్సైజ్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది.

డీఏపీ కోసం బారులు



బారులు తీరిన రైతులు

ముథోల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం డీఏపీ కోసం రైతులు ఉదయం నుంచి బారులు తీరారు. పీఏసీఎస్ కార్యాలయానికి 400ల డీఏపీ సంచులు రావడంతో రైతులు అధిక సంఖ్యలో వచ్చారు. డీఏపీ ఎరువులు దొరకని కొందరు రైతులు నిరాశతో వెనుదిరిగారు.

రాజ్‌గోండ్ సేవా సమితి నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన రాజ్‌గోండ్ కార్యవర్గం

పెంబి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల రాజ్ గోండ్‌ను సేవా సమితి నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నైతం దుర్గు, గౌరవ అధ్యక్షులు దేవురావు, ఉపాధ్యక్షులుగా తొడసం కేశవరవు, ప్రధాన కార్యదర్శి గణపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ పగ్గు, కోశాధికారి వెడ్మ శేఖర్, జాయింట్ సెక్రటరీ టేకం శ్రీను, ప్రచార కార్యదర్శి ఆత్రం విశ్వనాథ్, సాంస్కృతిక కార్యదర్శి పెంద్రం జంగులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మల్లపల్లి స్వామి, తదితరులు ఉన్నారు.

రెగ్యూలర్ ఈవో నియమించాలని తహసీల్దార్‌కు వినతి

కుబీర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుబీర్‌కు రెగ్యూలర్ ఈవోను నియమించాలని ఎస్సీ వాడ కాలనీ వాసులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యూలర్ ఈవో లేక పోవడంతో మండల కేంద్రం కుబీర్‌లోని పలు సమస్యలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఎస్సీ కాలనీలో విద్యుత్‌సరఫరా ఆగి పోయి నీటి సమస్య రావడం, హ్యాండ్ బోర్ చెడి పోయి నెలలు గడుస్తున్న మరమ్మత్తులు చేయడం లేదన్నారు. ఈ విషయం ఇంచార్జీ ఈవోను అడిగితే మా ఇష్టం ఉన్నప్పుడు చేస్తామని అన్నారని పేర్కొన్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి రెగ్యూలర్ ఈవోను నియమించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సునిత, అనిత, శోభ, సావిత్ర, సాయినాథ్, బాబు, తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నర్సాపూర్(జి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. గొల్లమాడ యువ నాయకుడు సిందే దీక్షిత్ పటేల్ దాదాపు 200ల మంది కార్యకర్తలు (బీజేపీ, కాంగ్రెస్ నుంచి) హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హరీష్ రావు వారికి కండువా కప్పి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నియోజకవర్గ ఇన్‌చార్జీలు, నాయకులు పాల్గొన్నారు. కట్కం దత్తాత్రి, అజయ్ కుమార్ చేరికల్లో కీలక పాత్ర పోషించారు.

కనులపండువగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

● హాజరైన ముథోల్, నిజామాబాద్ ఎమ్మెల్యేలు

భైంసా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయ పదోవార్షికోత్సవ వేడుకలు కనుల పండువగా కొనసాగాయి. శుక్రవారం ప్రారంభమైన వేడుకలు సోమవారం ముగిశాయి. వార్షికోత్సవ ముగింపు వేడుకలలో ముథోల్, నిజామాబాద్ ఎమ్మెల్యేలు రామారావ్ పాటిల్, ధన్‌పాల్ సూర్యనారాయణలు పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యేలకు ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేలు ఇద్దరు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు వేడుకలను పురస్కరించుకొని ఆలయ పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనము, 108 కలశాలతో మహా కుంభాభిషేకం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. పట్టణ వాసులతో పాటు డివిజన్ పరిధిలోని వివి ధ ప్రాంతాల నుంచి ఆయ్యప్ప దీక్షదారులు, భక్తులు అధిక సంఖ్యలో వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యారు. భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముథోల్, నిజామాబాద్ ఎమ్మెల్యేలు

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో నీరజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

భైంసారూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ అభివృద్ధి బాధ్యతలు నీరజ్ స్వీకరించారు. ఈ మేరకు గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సుధాకర్ రెడ్డి లక్ష్మణచాంద మండల కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రూప్- 1 పరీక్షల్లో ర్యాంకు సాధించి మొదటిసారిగా ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరిండెంట్ భీమ్ రావు, జూనియర్ అసిస్టెంట్ రాములు, ఎంపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో నీరజ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా లవకుమార్ సోమవారం ఉద్యగ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్- 1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. దీంతో ముథోల్ ఎంపీడీవోగా లవకుమార్ పదవీబాధ్యతలు చేపట్టారు. నిన్నటి వరకు ముథోల్ ఇన్‌చార్జీ ఎంపీడీవోగా ఎంపీవో శివకుమార్ విధులు నిర్వర్తించారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో లవకుమార్‌కు కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, సీనియర్ నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, కిషన్ పటేల్, రావుల శ్రీనివాస్, ఎంఎ అజీజ్, దిగంబర్, ఎస్కే నజీమ్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ : మండల నూతన ఎంపీడీవోగా సోమవారం శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పూలమాల శాలువాతో సన్మానించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధే లక్ష్యంగా సేవలు అందిస్తానన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

● ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మూడపెల్లి దినేష్

భైంసా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోనున్న విద్యార్థుల ఉపకార వేతనాలు సత్వరమే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మూడపెల్లి దినేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంబంధిత విషయంలో భైంసాలో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాలుగా ఉపకార వేతనాల విడుదల జరుగకపోవడం మూలంగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లితండ్రుల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఉపకార వేతనాల విడుదల విషయంలో ఒరిగిందేమీ లేదని అవేదన వ్యక్తం చేశారు. యూనియన్ ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం జాప్యపు విధానాలను విడనాడి పెండింగ్‌లోనున్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రధాన రోడ్డుపై భైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టి ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో పట్టణ హస్టల్స్ కన్వీనర్ సంతోష్, యూనియన్ డివిజన్ ప్రతినిధులు గంగారెడ్డి, ఓంకార్, ప్రకాష్, యోగేష్,ముత్యం, శ్రీధర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆరోగ్యం, విద్యపై సర్వే

నిర్మల్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ 2 ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం మూడోరోజు శాంతినగర్ కాలనీలో ఆరోగ్యం, విద్యపై సర్వే చేసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యూనిట్ 2, జిల్లా సమన్వయకర్త గరిపల్లి అర్చన తెలిపారు. జాతీయ సేవా పథకం విద్యార్థిని విద్యార్థులు అందరూ కలిసి విద్య, ఆరోగ్యంపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. మధ్యాహ్నం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు డాక్టర్ ఉమేష్‌గుప్తా ఆయుర్వేదిక్ వైద్యులు, ఆయుర్వేదిక్ వైద్యంపై అవగాహన కల్పించారు. ఇంట్లో ఉన్న పదార్థాలతో ఆరోగ్యంగా ఉండవచ్చని, అల్కలైన్ వాటర్‌ను ఇంట్లోనే ఏవిధంగా తయారు చేసుకోవచ్చో డాక్టర్ ఉమేష్ గుప్తా వివరంగా వివరించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ అన్నపూర్ణ ప్రదీప్‌తో యోగా తరగతిని నిర్వహించారు. యోగా గురువు ప్రదీప్ యోగాసనాలను విద్యార్థిని విద్యార్థులకు చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధాకర్, మధు నూరే ప్రిన్సిపల్, డాక్టర్ యు.గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్, ఐక్య సి కో-ఆర్డినేటర్ గోనెల సుభాష్, కోఆర్డినేటర్ తోకల శ్రీనివాస్, టాస్క్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రజిత, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బోరు మోటరు ఏర్పాటుకు నిధులు మంజూరు



బెంబర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన బోరు మోటరు

తానూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెంబర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బోరు మోటరు ఏర్పాటు కోసం ఎమ్మెల్యే రామారావుపటేల్ రూ. 1.5 లక్షల నిధులు మంజూరు చేయించారు. పాశాలలో నీటివసతి కల్పించాలని కోరుతూ ఇటీవల గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించగా, గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించి విద్యార్థులకు నీటి వసతి కల్పించాలని సూచించారు.

డాక్టర్ వేణుగోపాలకృష్ణకు విశిష్ట కళారత్న పురస్కారం



కళారత్న పురస్కారం అందుకున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైద్యులు, నటులు, దర్శకులు, కవి, రచయిత డాక్టర్ వేణుగోపాలకృష్ణ చేస్తున్న సేవలకు గాను విశిష్ట కళారత్నం, ఉత్తమ సామాజిక వేత్త పురస్కారం లభించింది. నిర్మల్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు పాటే మా ప్రాణం సంస్థలు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఇదివరకు ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారిగా, నిర్మల్ ఆర్ఎంవోగా, ఖానాపూర్, ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్‌గా అత్యుత్తమ సేవలందించి ఎన్నో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నారు. 57 సార్లు రక్తదానం చేసి ప్రాణదాత బిరుదు పొందారు. వైద్య రత్న, వైద్య శిరోమని, వైద్యశ్రీ డాక్టర్ వేణుగోపాలకృష్ణ కళారంగంలో ప్రేమతో నాన్న చిత్రానికి నంది పురస్కారాలు పొందారు. ఇప్పుడు విశిష్ట కళారత్న పురస్కారం... డాక్టర్ నీలిమ, కూరుతు డాక్టర్ సుహాసిని తో కలిసి డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఈ గౌరవాన్ని అందుకున్నారు.

'హలో విద్యార్థి చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయండి

దిలావర్‌పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 29న బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'హల్ విద్యార్థి చలో కలెక్టరేట్' ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా నాయకులు పుజారం మహేష్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయకుండా ప్రైవేట్ విద్యాసంస్థలను వేధించడం సరికాదన్నారు. ప్రభుత్వ చర్యల వల్ల చదువులు కుంటుపడి విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశముందన్నారు. వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారుజ సీఎం రేవంత్ రెడ్డి తన దగ్గర ఉన్న విద్యాశాఖ మంత్రి పదవిని సమర్థవంతుడైన ఎమ్మెల్యేకు అప్పగించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. పెండింగ్ ఫీజు బకాయిలు ప్రభుత్వం విడుదల చేసే వరకు బీఆర్ఎస్వీ పోరాటం చేస్తుందన్నారు.

గాయత్రి మైన్స్ కంపెనీపై అధికారులకు ఫిర్యాదు



మైన్స్ తవ్వి తీయడంతో ఏర్పడిన గుంతలు

ముథోల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లోని గుట్టపై గాయత్రి మైన్స్ కంపెనీ వారు మైన్స్‌ను (తెల్లరాళ్లు) తీస్తున్న ప్రదేశంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్న చోట ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయటం లేదని ఆర్‌ఐ నారాయణ పటేల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత కంపెనీ 15 సంవత్సరాలకు గుట్టను లీజుకు తీసుకొని ఈ మైనింగ్ తరలిస్తుంది. అయితే గత 14 ఏళ్ల నుంచి మైన్స్ తరలించినప్పటికీ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డ దగ్గర సూచిక బోర్డులు గాని ఎలాంటివి ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. పలుమార్లు గ్రామస్థులు విన్నవించిన విషయాన్ని సంబంధిత కంపెనీ ప్రతినిధులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ చేనుకు వెళ్లే రైతులకు ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు సైతం తెలుపుతున్నారని ఆర్‌ఐ తెలిపారు.

ఆలయాలకు కార్తీక శోభ

» ఖానాపూర్‌లో ఘనంగా శివపార్వతుల పల్లకి సేవ



లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు

ఖానాపూర్/ఉట్నూర్/ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్),అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు ప్రధాన ఆలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి.కార్తీకమాసం తొలి సోమవారం అయినందున సోమవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయనం నుంచి శివపార్వతుల పల్లకిని పట్టణ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ పల్లకి ఊరేగింపు కార్యక్రమానికి మహిళలు మంగళహారతులతో భారీగా తరలివచ్చారు. శివనామస్మరణతో పట్టణ పురవీధులు మార్మోగాయి. ఉట్నూర్‌లో కార్తీక మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కార్తిక దీపోత్సవం కార్యక్రమాన్ని అతిధుల ఆధ్వర్యంలో గణపతి పూజలు నిర్వహించి ప్రారంభించారు. మండలానికి చెందిన మహిళలు మంగళ హారతులతో, దీపాలతో కార్తిక దీపోత్సవ ప్రాంగణానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా హాజరైన రాంసింగ్ మహారాజ్ మాట్లాడుతూ ధర్మరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు ఈ కార్యక్రమంలో నిర్వహించడం శుభ పరిణామం అన్నారు.కార్తీక మాసంలో చీకటిని పారద్రోలి అందరి జీవితాల్లో వెలుగు నింపడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మారుతి మహారాజ్, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ విభాగ్ కార్య వాహ దిగంబర్ సీఐ పద్మ, శ్రీరాం నాయక్, డాక్టర్ సాడిగే రాజగోపాల్, కొండేరి రమేష్, బింగి వెంకటేష్, కొండగట్టు అంజన్న, గడ్డం ప్రకాష్, రాముని నాగన్న పాల్గొన్నారు.ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో సోమవారం సాయంత్రం కార్తిక మసాన్ని పురస్కరించుకుని కోటివత్తుల కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించగా.. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



ఉట్నూర్‌లో జరిగిన దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

» రూ.14 వేల నగదు స్వాధీనం » ఏడుగురి అరెస్టు
» 6 మొబైళ్లు, 4 బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అనుకుంటా శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులనుఅరెస్టు చేయడంతో వారి వద్ద నుంచి రూ.14 వేలు, 6 మొబైల్ ఫోన్‌లు, నాలుగు బైక్‌లు, ఒక ఆటోను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై విష్ణువర్ధన్ మాట్లాడుతూ. ప్రజలు చట్ట వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఎమ్మెల్సీ దృష్టికి బోథ్ సమస్యలు

బోథ్; అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ నెలగంటి సత్యం పోరాటం జరిగిందని బోథ్ మండల సీపీఐ పార్టీ ప్రధాన కార్యదర్శి నరేష్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీని కలిసి బోథ్ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీర్చాలని సరైన వసతులు కల్పించాలని ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరీ చేయించేందుకు కృషి చేయాలని తెలిపామని వారు తెలిపారు. బోథ్ సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించాలని కోరడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఏఐఎస్ఎఫ్ బోథ్ మండల అధ్యక్షుడు ముస్సిఫ్ ఉన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని పెన్షనర్ల ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యాపకుడు సుధాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీధర్, కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, బాపూరావు, గణపతి పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

» తొలిరోజు రూ.6950 ధరతో ముందుకు వచ్చిన ప్రైవేట్ వ్యాపారాలు
» తేమ నిబంధనను సడలించాలని అన్నదాతల నిరసన..



మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి వాహనాలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్),అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):పత్తి కొనుగోళ్ల ప్రక్రియ పకడ్బందీగా కొనసాగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ డైరెక్టర్ కేశవులు పేర్కొన్నారు. మార్కెట్ యార్డ్‌లో సోమవారం పత్తి కొనుగోళ్లను ఆయన ప్రారంభించారు.కొనుగోళ్ల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం జిల్లాల వారీగా పర్యవేక్షకులను నియమించగా..ఆదిలాబాద్‌కు ఆయనను కేటాయించారు. ముందుగా పత్తి వాహనాలను తూకం వేయించి కొనుగోళ్లను ప్రారంభించారు. ప్రైవేట్ వ్యాపారులతో వేలంపాత వేయించారు. ప్రైవేటులో రూ.6950 ధర్నాను నిర్వహించారు. సీసీఐ ద్వార ఎనిమిది శాతం తేమ కలిగిన పత్తికి రూ.8110 ధరతో కొనుగోలు చేపట్టారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వాలు మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నాయని, పత్తి కొనుగోళ్లకు కేంద్రం కిసాన్ కపాస్ యాప్‌ను తీసుకువచ్చిందని తెలంగాణ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ డైరెక్టర్ కేశవులు తెలిపారు. ఇందులో ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని ఆ తేదీకి మార్కెట్ యార్డుకు రావాల్సి ఉంటుందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎటువంటి సందేహాలు ఉన్న సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈకార్యక్రమంలో వరంగల్ మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్, ఆర్డీవో స్రవంతి, డీఏఓ శ్రీధర్ స్వామి, మార్కెటింగ్ ఏడీ గజానన్, ఏడీఏ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.రైతుల ఆందోళన..పత్తి కొనుగోళ్లలో తేమ నిబంధనలను సడలించాలని డిమాండ్ చేస్తూ రైతులు నిరసనకు దిగడం తో కొంత ఆందోళనకర పరిస్థితి నెలకొంది. అధికారులతో పాటు..ఎమ్మెల్యే పాయల్‌శంకర్ సైతం అక్కడికి చేరుకొని రైతులతో మాట్లా డారు. ఎమ్మెల్యే స్వయంగా వాహనంలో తేమ శాతాన్ని పరిశీలించారు.తేమశాతం మినహా యింపు కోసం తనవంతుగా కృషి చేశానని, రైతుల కోసం అవసరమైన చర్యలు తీసుకుం టున్నట్లు పేర్కొన్నారు.అయితే స్పష్టమైన హా మీ ఇచ్చేంత వరకు కొనుగోలు ప్రక్రియ కొన సాగించబోమని రైతులు స్పష్టం చేశారు. డీసీ సీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీఎస్పీ జీవన్‌రెడ్డి పరిస్థితుల ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ..తేమ నిబంధనలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించామని,నిబంధనల్లో మినహాయింపుతో కొనుగోలు చేయలమని అంటున్నట్లు తెలిపారు. వాతావ రణ మార్పులతో తేమశాతం పెరిగింద న్నారు. రైతులకు న్యాయం జరిగేలా తనవంతుగా కృషి చేస్తానని భరోసా కల్పించారు. అయితే రైతులు మాత్రం కొనుగోళ్ల తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.రైతులనుమోసం చేయడానికే గుట్టుచప్పుడు కాకుండా 24నకొనుగోళ్లను ప్రా రంభించారని ఆరోపిం చారు. ఇప్పటికైనా తమ కు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.

అస్తవ్యస్తంగా రోడ్లు

» అడుగుకో గుంత » కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం.. అధికారుల నిర్లక్ష్యం
» వాహనదారులకు ఇబ్బంది కరంగామారిన రోడ్లు » పట్టించుకోని అధికారులు



చాందూరిరోడ్డు ఇదే..



గుంతలతో నిండిన లక్షెటిపేట రోడ్డు ↑

ఉట్నూర్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లు అస్తవ్యస్థంగా మారడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.ప్రతిరోజు ఏదో ఒక పనిపైన రోడ్డు వైపు ఉన్న ప్రాంతాలకు, మండల కేంద్రాలకువెళ్లాల్సి వస్తున్నందున వాహనదారులు గ్రామస్థులు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. మండలంలోని హస్నాపూర్ నుంచి చాందూరి వరకు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డు ఐదేళ్లలోపే అధ్వానంగా మారింది. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం, అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు పై వేసిన తారు కొట్టుక పోవడంతో రోడ్లపై గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు సైతం వెళ్లలేక పోతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇదే విధంగా శ్యామ్‌పూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సుంగుగూడ,రాజన్నగూడా, తాండ్ర వరకు వేసిన బీటీ రోడ్డు సైతం గుంతలమయంగా మారింది. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి లక్షెటిపేట, కామాయిపేట వెళ్లేదారి పై కూడా లక్షెటిపేట వాగు సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కొట్టుకపోయిగుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై వరద నీళ్లు మారడంతో రోడ్లపై ఉన్న మట్టి, కంకర కాస్త కొట్టుకుపోయిభారీగుంతలుఏర్పడ్డాయి.రోడ్లపై కంకర లేచి, గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనాలు సైతం నడవలేని పరిస్థితి ఏర్పడిందని గిరిజన ప్రాంతాల ప్రజలు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రోడ్లమరమ్మతుల కోసంఅంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపించిరోడ్లకు మరమ్మతులు చేసి గ్రామీణులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చైల్డ్ లైన్ సంరక్షణలో..
ఒరిస్సా బాలుడు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్),అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి):ఒరిస్సా నుంచి వచ్చినట్లు చెబుతున్న బాలుడు ప్రస్తుతం ఆదిలాబాద్ చైల్డ్ లైన్ సంరక్షణలో ఉన్నాడు. అధికారుల కథనం ప్రకారం..దాదాపుగా 12ఏళ్ల వయసు ఉన్నఒక బాలుడు ఒంటరిగా దిగులుగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో సంచరిస్తుండడాన్ని రైల్వే ఔట్ పోస్టు పోలీసులు గమనించారు. దగ్గరికి చేరదీసి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. బాలల సంరక్షణ విభాగం అధికారులకు సమాచారం ఇచ్చారు. చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ రామకృష్ణ, సూపర్‌వైజర్ సామల వెంకటేష్‌లు బాలుడిని సంరక్షణ కేంద్రానికి తీసుకు వచ్చి భోజనం పెట్టి వసతి కల్పించారు. తమది ఒరిస్సా రాష్ట్రం అని, భద్రక్ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదివేవాడినని బాలుడు హిందీలో చెప్తున్నాడు. తల్లి పేరు మమతా, తండ్రి జయప్రకాష్‌లు ఒక లిక్కర్ కంపెనీలో పనిచేస్తారని, 15 రోజుల క్రితం తాను ఒరిస్సా చౌరంభా స్టేషన్‌లో రైలు ఎక్కి అక్కడ క్కడా తిరిగి తర్వాత పూర్ణ వెళ్లే రైల్లో ఇక్కడికి అనుకోకుండా వచ్చినట్లు చెప్తున్నాడు. కాగా బాలుడి గురించి ఇక్కడి జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్ ఒరిస్సాలోని బాలల సంరక్షణ అధికారులకు సమాచా రంతో పాటు ఫోటోలు పంపించారు. త్వరలోనే పూర్తి వివరాలు ధృవీకరించుకుని తల్లిదండ్రుల వద్దకు చేర్చే ప్రయత్నాలు చేస్తున్నారు.

తెగిపోయిన విద్యుత్ తీగలు

బోథ్,అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచ్లాపూర్ బస్టాండ్ సమీపంలో బ్రిడ్జి వద్ద తెగిపోయిన విద్యుత్ తీగలను విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో దొంగల పాలయ్యే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. గత యేడాది పొచ్చెర గ్రామ రైతుల కోసం గతంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన విద్యుత్ తీగలు సైతం ఇలాగే తెగిపడి ఉండడంతోస్థానిక రైతులు విద్యుత్ తీగలను తీసుకువెళ్లండి అని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. ఆయన పట్టించుకోక పోవడంతో వేలాది రూపాయల విలువైన విద్యుత్ వైర్లు దొంగల పాలయిందన్నారు.ప్రస్తుతం సైతం తీయబడ్డ విద్యుత్ తీగలను తీసుకు వెళ్లకపోతే దొంగల పాలయ్యే అస్కారం ఉందని స్థానికులు అంటున్నారు. గత యేడాది క్రితం గుర్తు తెలియని దొంగలు విద్యుత్ తీగలు దొంగలపాలైందని వాపోయారు. దీంతో రైతులకు నష్టం సంభవించింది. భారీ నష్ట జరగక ముందే అధికారులు విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.



కుచ్లాపూర్‌లో తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు

నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలి

తలమడుగు,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):లవ్ జిహద్ పేరిట హిందూ అమ్మాయిలను మోసం చేస్తున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం తలమడుగు పోలీస్ స్టేషన్‌లో తలమడుగు గ్రామానికి చెందిన యువజన సంఘాల నాయకులు పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక వర్గం వరు కావాలనే హిందూ అమ్మాయిలను ప్రేమపేరుతో అమ్మాయిలను దగ్గర తీసుకొన్ని అర్ధనగ్న చిత్రాలను ఫోటో తీసుకొని చిత్రాలను ఫోటో తీసుకొని అమ్మాయిల బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల మండలంలో ఇద్దరిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా బాధ్యులపై మరింత కఠిన చర్యలు తీసుకొని వారి వెనుక ఎవరు ఉన్నదన్నది పూర్తి విచారణ చేపట్టాలని వారు కోరారు. అనంతరం పోలీసులకు పిర్యాదు చేశారు. ఇందులో యువజన సంఘాల సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

మొరం తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ సీజ్



ఎక్స్‌కవేటర్‌ని సీజ్ చేసిన అధికారులు

ముథోల్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌శివా రులో గల ఓగుట్టవద్ద అక్రమంగా మొరం తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ని సోమవారం సీజ్ చేసినట్లు ఆర్‌ఐ నారాయణ పటేల్ తెలిపారు. అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి సంబంధిత వాహనాన్ని సీజ్ చేసి ఉన్నతాధి కారుల కు నివేదించినట్లు ఆయన తెలిపారు. ఆర్‌ఐ వెంట జీపీవో కౌసర్ ఖాన్, నర్స య్యలు ఉన్నారు.

కడ్తాల్‌లో ఒకరి అదృశ్యం



రాజారామ్ సాయిరెడ్డి(ఫైల్)

సోన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణానికి చెందిన రాజారామ్ సాయిరెడ్డి కడ్తాల్ గ్రామ శివారులో గల సాగర్ కన్వెన్షన్ హాల్‌లో బంధువుల పెళ్లికి ఈ నెల 24వ తేదీన వచ్చాడు. గత రెండు రోజుల నుంచి రాజారామ్ సాయిరెడ్డి కనబడటం లేదు. రాజారామ్ కొడుకు సతీష్ 26న సోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

ఖానాపూర్,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):గత ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఖానాపూర్‌లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కోమటిపెల్లి నడిపి పోశెట్టి(50) అనే వ్యక్తి గత ఐదేళ్లుగా టీబీతో బాధపడుతున్నాడు.కాగా ఇటీ వల కొద్ది నెలలక్రితం నుంచి మద్యానికి బానిస అయ్యాడు.మద్యంమత్తులో పలు మార్లు కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లడం తిరిగి రావడం చేసే వారు. ఆదివారం మద్యం తాగి కుటుంబ సభ్యులకు ఎవరికి చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు.దీంతో పోశెట్టి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. కాగా సోమవారం గాంధీనగర్ సమీపంలో గల అడవుల్లో టేకుచెట్టుకు ఉరేసుకుని వేలాడుతున్న పోశెట్టి మృతదేహాన్ని గుర్తించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైరాహుల్ పేర్కొన్నారు.

గొంతు మార్చి.. వలపు వల విసిరి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ బాధితుడిని మహిళగా నమ్మించి... భారీ మొత్తంలో డబ్బులు మోసం చేసిన ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి పాల్గొని కేసు వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన ఎం.లక్ష్మీకాంత్ ఫిర్యాదు మేరకు ఈనెల 25వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు తన వివాహానికై ఆన్ లైన్‌లో, యుట్యూబ్‌లో వివాహ వధువుల కోసం శోధిస్తున్న సమయంలో కృష్ణవేణి అనే అమ్మాయి ఫోటోతో యూట్యూబ్‌లో రూపవత్ శ్రావణ్ కుమార్ అనే వ్యక్తి బాధితునికి పరిచయమయ్యారు. కృష్ణవేణి అనే అమ్మాయి ఉందని నమ్మబలికి మాలోత్ మంజి అనే మోసగాడిని పరిచయంచేశాడు. ప్రధాననిందితుడు మాలోత్ మంజి బాధితున్ని కృష్ణవేణి అనే అమ్మాయి పేరుతో, మహిళ గొంతుతో మాట్లాడి తను ఒక ధనవంతురాలినని, తన ఆస్తులు కోర్టులో చిక్కుకున్నాయని నమ్మబలికాడు. బాధితుడి నుంచి విడతల వారీగా రూ.ఎనిమిది లక్షలు తీసుకున్నారు.మహిళగొంతుతో మాట్లాడిన ప్రధాన నిందితుడితో మోసపోయానని గ్రహించిన బాధితుడు...1930ద్వారా సైబర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సైబర్ సెల్, వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకబృందం సూర్యాపేట జిల్లాలో ముగ్గురు నిందితులను పట్టుకొని అరెస్ట్ చేయ డం జరిగిందని తెలిపారు. వీరి నుంచి ఒకటిన్నర లక్షల రూపాయల నగదు, మూ డు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సూర్యాపేట జిల్లాకు చెందిన మాలోత్ మంజి అలియాస్ కృష్ణవేణి, బుక్య గణేష్, రూపవత్ శ్రావణ్ కుమార్ లను అరెస్ట్ చేసి నట్లు తెలిపారు. మీడియా సమావేశంలో డబ్ల్యూపీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, సైబర్ సెల్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
మంగళవారం 28 అక్టోబరు 2025



గుంజాల పాఠశాలలో పాము కలకలం



భీంపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజాల పాఠశాల ఆవరణలో సోమవారం పామును చూసి విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఆ తరువాత స్థానికులు పామును చంపివేశారు. అయితే ఈ పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు ఉండటంతో పాము వచ్చిందని పేర్కొన్నారు. పిచ్చిమొక్కలను తొలగించాలని, ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

నూతన ఎంపీడీవోగా వంశీకృష్ణ బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్(ఆదిలాబాద్ రూరల్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండల నూతన ఎంపీడీవోగా కె.వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వంశీకృష్ణను కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యదర్శులకు తమ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే తమ విధులలో పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. కాగా బాధ్యతలు స్వీకరించిన వంశీకృష్ణకు ఇది మొదటి పోస్టింగ్ కావడం విశేషం. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేసిన స్వప్నశీల ఫారెన్ సర్వీసెస్‌పై హౌసింగ్ బోర్డ్ శాఖలో వేరే జిల్లాకు వెళ్తున్నట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

..ఇచ్చోడ ఎంపీడీవోగా నరేష్

ఇచ్చోడ, అక్టోబరు, 27(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ నూతన ఎంపీడీఓగా నాగం నరేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల విడుదలైన గ్రూప్1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికైన నరేష్ ఇచ్చోడ ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరించారు. ఇచ్చోడలో మొదటిసారిగా మండల అధికారిగా విధుల్లో చేరడం సంతోషంగా ఉందని అన్నారు. మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.

..గుడిహత్నూర్ ఎంపీడీవోగా మహ్మద్ ఇంతియాజ్

ఆదిలాబాద్(గుడిహత్నూర్): మండల నూతన ఎంపీడీవోగా మహ్మద్ ఇంతియాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది పంచాయితీ కార్యదర్శులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో అన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ఆందోళన

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టారు. ర్యాలీగా తరలివచ్చి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. నాలుగేళ్లుగా రీయింబర్స్‌మెంట్స్ రాకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కన్వీనర్ నిఖిల్ అన్నారు. ఇందులో జిల్లా కన్వీనర్ నిఖిల్, అరుణ్, మనీష్, అభిరాం, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మద్యం దుకాణాల లక్కీడ్రా

» 2025-27 గాను కలెక్టర్ సమక్షంలో టెండర్‌దారుల ఎంపిక » ఆరు దుకాణాలకు డ్రా వాయిదా



ఎంపికైన వారికి సంబంధిత పత్రాలు అందిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పాలసీ 2025-27 సంవత్సరానికిగాను మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ సోమవారం సజావుగా సాగింది. ప్రశాంత వాతావరణంలో లక్కీడ్రా నిర్వహించి దరఖాస్తుదారులను ఎంపిక చేశారు. మావలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన సమక్షంలో లక్కీ డ్రా చేపట్టి దరఖాస్తుదారులను ఎంపిక చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే.రఘురాం, సూపరింటెండెంట్ హిమశ్రీతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 40 దుకాణాలకుగాను 34 షాపులకు లక్కీ డ్రా నిర్వహించారు. మరో ఆరు దుకాణాలకు దరఖాస్తులు తక్కువగా రావడంతో వాటిని వాయిదా (మిగితా 6వ పేజీలో...)



● పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

దూది రైతు.. దుఃఖం

పత్తి కొనుగోళ్లలో తేమ కిరికిరి

తేమ శాతం, మద్దతు ధర ఇలా..

8 తేమ శాతం	రూ.8,110
9 తేమ శాతం	రూ.8,028
10 తేమ శాతం	రూ.7,947.80
11 తేమ శాతం	రూ.7,866.70
12 తేమ శాతం	రూ.7,785.60

» తొలిరోజే గందరగోళంగా మారిన పత్తి కొనుగోళ్లు
» సీసీఐ తేమ నిబంధనలను సడలించాలని రైతుల పట్టు
» ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో అన్నదాతల ఆందోళన
» కలెక్టర్, ఎమ్మెల్యే చొరవతో మధ్యాహ్నం నుంచి కొనుగోళ్లు ప్రారంభం
» మద్దతు ధర రూ.8,110 కాగా ప్రైవేట్‌లో రూ.6,950

ప్రతియేటా మాదిరిగానే.. పత్తి కొనుగోళ్లలో తేమ శాతంపై అన్నదాతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ముందుగా నిర్ణయించిన ప్రకారమే సోమవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే, ఒకటి, రెండు వాహనాలు మినహా దాదాపుగా అన్ని పత్తి వాహనాలలో అధిక తేమ ఉండడంతో సీసీఐ అధికారు లు పత్తిని కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన రైతులు పత్తి తూకం కాంటల వద్ద ఆందోళనకు దిగారు.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో బైఠాయించిన పత్తి రైతులు



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యేటా పత్తి కొనుగోళ్లలో తేమశాతంపై అధికారులతో కిరికిరి తప్పడం లేదంటూ రైతులు మండిపడ్డారు. గతంలో తేమ శాతం పేరిట సీసీఐ కొనుగోళ్లకు కొర్రీలు పెట్టడంతో రైతులు ఆగ్రహించి మార్కెట్ యార్డు కార్యాలయంపై దాడికి దిగారు. అప్పట్లో పలువురు రైతులపై కేసులు కూడా నమోదు చేసిన దాఖలాలు ఉన్నాయి. ఈ యేడు జిల్లాలో 4లక్షల8వేల 260.28 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. దీంతో 33లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు వస్తాయని అధికారు లు అంచనా వేస్తున్నారు. కొనుగోళ్లను సజావుగా చేపట్టేందుకు జిల్లావ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఈసారి కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను అమలు చేస్తున్నందున.. ఈనెల 23నే ట్రయల్‌రన్‌ను కలెక్టర్ రాజర్షిషా పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. కాగా సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే తేమ శాతం పేరిట ధరల్లో కోతలు పెట్టడంతో మద్దతు ధర దక్కడం లేదంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

తేమ 12 శాతం లోపు ఉంటేనే..

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) విధించే తేమ శాతం నిబంధనలు కఠినంగా ఉండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. తేమ 8శాతం ఉంటేనే పూర్తి మద్దతు ధర రూ.8,110 దక్కే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం జిల్లాలో అలాంటి పరిస్థితులు ఎక్కడ కనిపించడం లేదు. పదుల సంఖ్యలో రైతులకు మాత్రమే మద్దతు ధర దక్కుతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పత్తిలో అధిక తేమ ఉండడంతో మొదటి నెల రోజుల పాటు 12 నుంచి 20 శాతం వరకు తేమలో సడలింపు ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. 8 తేమ శాతానికిపైగా ఉన్న పత్తికి ఒక్కో శాతానికి రూ.81 తగ్గే అవకాశం ఉంది. ఇలా తేమ 12 శాతం ఉన్న పత్తికి రూ.7,785.60 మద్దతుధర దక్కనుంది. ఆపైగా తేమ శాతం అధికంగా ఉంటే సీసీఐ కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తుంది. గత్యంతరం లేక తక్కువ ధరకైనా పత్తిని అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో రైతులు క్వింటాలుకు రూ.వెయ్యికి పైగా నష్టపోతున్నారు. సీసీఐ కఠినమైన నిబంధనలతో ప్రైవేట్ వ్యాపారులు (తరువాయి 6వ పేజీలో....)

పకడ్బందీగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియ

» రాష్ట్ర విత్తన ధ్రువీకరణ డైరెక్టర్ కేశవులు
» తేమ నిబంధనను సడలించాలని పత్తి రైతుల నిరసన

మరిన్ని వివరాలు 7వ పేజీలో..



గిరిజనులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్తా

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ఉట్నూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం ఐటీడీఏలో నిర్వహిస్తున్న గిరిజన దర్బార్ వరకు వస్తున్న అర్జీలను క్షేత్ర స్థాయిలో అధికారులు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో అర్జీలు స్వీకరించారు. గిరిజనుల అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూశాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. పీవో మాట్లాడుతూ అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా అధికారి

నేరడిగొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రామారావ్ అన్నారు. సోమవారం మండలంలోని లింగట్ల గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ పాడిరైతులు పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. ఈ వ్యాధి నివారణకు సంబంధించి పశువులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమన్నారు. అలాగే వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గేపాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డా. జీవన్ రాథోడ్, సిబ్బంది. వెంకన్న, అరుణ్, సురేష్, శివప్రసాద్, జంగు మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి అహ్మద్ పర్వేజ్ అన్నారు. మండలంలోని జాతర్ల, గోకొండ, దాబడి గ్రామలలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువుల నోటిలో, కాలిగిట్టల మధ్య పుండ్లు రావడం, జ్వరం లాంటి వ్యాధి లక్షణాలు పశువుల్లో గుర్తించాలన్నారు. ఇందులో సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవజాత శిశు మరణాలను తగ్గించేందుకు చర్యలు

» కలెక్టర్ రాజర్షి షా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవజాత శిశువుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన నూతన శిశు సంరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నవజాత శిశు మరణాల రేటును సింగిల్ డిజిట్ స్థాయికి తగ్గించేదుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరింత అంకితభావంతో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గిరిజన ప్రాంతం అధికంగా ఉండడం, పలు భౌగోళిక, సామాజిక సవాళ్లు ఉన్న వైద్య బృందం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే వైద్య శాఖ చేపడుతున్న చర్యల వలన మాత, శిశు, బాల మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు. ప్రతీ ప్రసవ కేంద్రంలో, ప్రతీ జనన సమయంలో నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. నవజాత శిశు మరణాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఐసీఎంఆర్ కార్యక్రమంలో భాగంగా రిమ్స్ ఆదిలాబాద్, నిలోఫర్, ఏఐఐఎంఎస్ ఆస్పత్రులు, హైదరాబాద్ సహకారంతో ఈ శిక్షణ నిర్వహిస్తున్నారని, ఈ శిక్షణ ద్వారా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రతి శిశువుకూ సమయానికి సురక్షిత సేవలు అందించే నైపుణ్యం పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, డాక్టర్ ధన్నిగై నాథన్, వైద్యులు, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎంఎస్ఎన్ లాబొరేటరీస్‌లో ఉద్యోగాలకు ఎంపికైన 17 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో దాదాపు 50 మంది యువకులు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 17 మంది అభ్యర్థులు పరీక్షలో ఉత్తీర్ణులై ఎంఎస్ఎన్ లాబొరేటరీస్‌లో నియామకం పొందినట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ హెచ్ఆర్ సుబ్బారావు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంటలను ప్రభుత్వాలు కొనుగోలు చేస్తున్నాయని, రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ యార్డ్‌లో మార్క్ ఫెడ్ ద్వార మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. తూకం యంత్రానికి పూజలు చేసి తొలి రైతును సత్కరించారు. మొక్కజొన్న పంటను క్వింటాలుకు రూ.2400తో కొనుగోలు చేయడం జరుగుతుందని, మధ్య దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే పంటను విక్రయించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. త్వరలోనే సోయా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, తెలంగాణ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ డైరెక్టర్ కేశవులు, వరంగల్ మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్, ఆర్డీవో స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రైతులపై కేంద్రం వివక్ష: ఆడె

నేరడిగొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతులపై తీవ్ర వివక్ష చూపుతున్న కేంద్ర ప్రభుత్వం మరొక్కసారి రైతుల్ని నట్టేట ముంచడానికి సిద్ధమైందని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ విమర్శించారు సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని పంటలతో పాటు సోయా పంటకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయలేమని చేతులెత్తేయడం రైతులని నిండా ముంచడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు పక్షపాతి కాదని గుర్తుంచుకోవాలని, గ్రామాల్లోకి వచ్చిన బీజేపీ నాయకులు నిలదీయాలని ఆయన అన్నారు. రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా పూర్తిస్థాయి సోయాపంట కొనుగోలు షెడ్యూల్ విడుదల చేస్తుందని, రైతులు అధైర్య పడి దళారులకు పంటను అమ్ముకోవడం చేయవద్దన్నారు.

బస్సు సౌకర్యం కల్పించరూ!

భీంపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి మండలంలోని కరంజి(టి) వరకు ఆర్టీసీ బస్సులను విద్యార్థులకు అనువుగా ఉండే సమయాలలో నడపాలని సోమవారం పలువురు నాయకులు జిల్లాకేంద్రంలోని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామానికి సరైన రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మండల నాయకులు గుర్ల నరేందర్, బక్కి కపిల్, గుండా ప్రకాష్, గుర్ల శేఖర్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.



జీఎస్టీపై వ్యాపారస్తులకు వివరిస్తున్న ఎంపీ గోడం నగేష్

మోదీ పాలనపై ప్రశంసలు : ఎంపీ

ఇచ్చోడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాలు మోదీ పాలనను కొనియాడుతున్నాయని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్‌లో, వ్యాపారుస్థుల దుకాణాలకు కాలినడకన వెళ్లి తగ్గింపు జీఎస్టీ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. జీఎస్టీ తగ్గింపు సామాన్యుడికి వరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, అసెంబ్లీ కన్వీనర్ కదం బాబారావ్, సీనియర్ నాయకులు అమ్టె మాధవరావ్, మండల అధ్యక్షుడు తహరే రమేష్, నాయకులు బీంరెడ్డి, తదితరులున్నారు.

సోయా కొనుగోళ్లు ప్రారంభించాలి

» మాజీ మంత్రి జోగు రామన్న
» రైతు సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ ఆందోళన

ఆదిలాబాద్(జైనథ్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బేల మండల కేంద్రంలో సోయా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ మంత్రి జోగు రామన్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బేల జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి రైతు సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. సోయా పంటను చేత చూయిస్తూ వినూత్న నిరసన చేపట్టారు. మార్కెట్ అధికారులు సోమవారం సోయా కొనుగోలు ప్రారంభిస్తామని చెప్పి మాట తప్పడంతో రైతులు ఇబ్బందులకు గురి అవడం జరుగుతుందని, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ జిల్లా బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ధర్నా కార్యక్రమాన్ని పూనుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ తక్షణం కొనుగోలు ప్రారంభించకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరు దద్దమ్మలే అని ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఇందులో రౌతుమనోహర్, ప్రమోద్‌రెడ్డి, సతీష్‌పవార్, గంభీర్‌ఠాక్రె, విప్పిన్, కుమ్రరాజు, రాజన్న, బట్టుసతీష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బేలలో ధర్నా చేస్తున్న జోగు రామన్న, నాయకులు



సోనాల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సోనాలలో రైతుల వంటా వార్పు

బోథ్: ప్రభుత్వం రైతులు పండించిన సోయాబీన్, మొక్కజొన్న పంటను తక్షణమే కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రైతులతో కలిసి తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతి పత్రం ఇచ్చారు. అంతకుముందు వంటావార్పు నిర్వహించారు. రైతు నాయకులు ముత్తన్న, జనార్దన్‌లతో పాటు నాయకులు ఈ అభిలాష్, భీమావు పాటిల్, యల్ల సుధీర్ రెడ్డి, హరీష్, మాజీ ఎంపీటీసీ లంక లలిత రామ్‌కిషన్, వినోద్, సంజీవ్‌రెడ్డి, సుగుణాకర్, తదితరులున్నారు.